క్లుప్తంగా

సబ్ కలెక్టర్‌ను కలిసిన నూతన డీఎస్పీ


సబ్ కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న నూతన డీఎస్పీ సోమన్న

ఆదోని రూరల్: నూతన డీఎస్పీ సోమన్న మంగళవారం ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, అసాంఘిక కార్యకలాపాలు చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్య విజ్ఞానాన్ని పెంచుతుంది


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నిరంజన్‌రెడ్డి

పెద్దకడబూరు: విద్య అనేది విజ్ఞానాన్ని పెంచుతుందని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలు తమతమ పిల్లలకు మంచి చదువులు చెప్పించాలన్నారు. చదువులు లేకపోతే చెడువ్యసనాలకు దగ్గరై జీవితాలనే నాశనం చేసుకుంటారన్నారు.

మొక్కల పెంపకంతోనే ఆరోగ్యం

గోనెగండ్ల : మొక్కలను పెంచడంతోనే మానవాళికి ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గోనెగండ్లలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్, సర్పంచ్ హైమవతి, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, సతీష్, సోమేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో ఇతరుల జీవితాల్లో వెలుగు

ఆదోని అర్బన్: అవయవదానం చేసి మరొకరి జీవితాల్లో వెలుగు నింపాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌తో పాటు ఐఎంఏ తరఫున ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ కృష్ణమూర్తి హాజరై మాట్లాడారు. మనిషి చనిపోయిన తర్వాత శరీరంలోని కొన్ని అవయవాలు ఇతరులకు దానం చేస్తే ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపిన వారవుతారని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్, అవోపా సభ్యులు రఘు, ఈరన్నశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఓపీ కౌంటర్ ప్రారంభం


రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్

ఆదోని అర్బన్: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని నూతన బ్లాక్‌లో మహిళా విభాగపు నూతన ఓపీ నమోదు కౌంటర్‌ను మంగళవారం సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో సైటోపథాలజీ, మైనర్ ఓటీ ల్యాబ్‌లను, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సేవలు వెలకట్టలేనివి


మాట్లాడుతున్న జడ్జి లీలసాయి సుభాష్

ఆదోని రూరల్: మానసిక వికలాంగులకు తల్లిదండ్రులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఆదోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ లీలసాయి సుభాష్ అన్నారు. మంగళవారం మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల పాఠశాలను సందర్శించి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. జడ్జి మాట్లాడుతూ మానసిక వికలాంగుల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శివకుమార్‌స్వామి, హుసేన్‌సాని, శ్రీధర్ సింగ్, కళ్యాణ్‌రెడ్డి, సుబ్బన్న పాల్గొన్నారు.

కుళాయి నీటి పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రజలకు కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిని మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీరు క్లోరినేషన్, శుద్ధి చేయడం పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. గుడికల్ రోడ్డులోని పంప్‌హౌస్‌లోని ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. డీఈఈ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

- విజృంభిస్తున్న తెగుళ్లు
- వర్షాభావంతో పెరుగుదల లోపించిన పైరు
- ఖర్చులు తడిసిమోపెడు

పత్తికి పీడ..రైతుకు దడ.!

కర్షకుడి కష్టాలకు కొలమానం కరువైంది.. కనికరం లేని పాలకులు.. కలసిరాని కాలం అన్నదాతను అగాధానికి నెడుతున్నాయి. ఆత్మాభిమానం చంపుకోలేక తమను తాము చంపుకుంటున్న వారు కొందరైతే.. ఆశ చావక సత్తువ తెచ్చుకొని మళ్లీ, మళ్లీ సేద్యం మొదలు పెడుతూనే బతుకు పంట పండించాలనే తాపత్రయం మరికొందరిది. రైతన్నకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కష్టాలు కన్నీరుతెప్పిస్తున్నాయి. వర్షాభావం ఒకవైపు, ప్రభుత్వ సహాయం కరువై మరో వైపు ఇబ్బందులు పడుతున్న పత్తి రైతులను 'చీడలు' పీడిస్తున్నాయి. కర్షకుల కష్టాన్ని పీల్చేస్తున్నాయి.

ఎమ్మిగనూరు: పరిస్థితులు అనుకూలించక.. సాగునీటి వనరుల్లో నీరు లేక జిల్లాలో ప్రధాన పంట వరికి గండిపడింది. వేరుశనగ వైపు రైతన్న మొగ్గు చూపడం లేదు. ఫలితంగా గత కొన్నేళ్లుగా జిల్లాలో ప్రధాన పంటగా పత్తి సాగు ఊపందుకుంది. ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఇప్పటివరకు 37,487 హెక్టార్లలో పత్తి పంట సాగయ్యింది. వరుసగా నష్టాలు ఎదురవుతున్న వరి, వేరుశనగ పంటలతో పోల్చుకుంటే పత్తిపంట కనీస దిగుబడులను ఇస్తుందని రైతన్న నమ్మకం. ఫలితంగా పత్తి పంటపై రైతులు ఆశలు పెంచుకున్నారు. అయితే వర్షాభావం మూలంగా వేలాది ఎకరాల్లో పత్తి విత్తనం మొలకెత్తక, మొలకెత్తినా పైరు పెరుగుదల లేక చాలా మంది రైతులు నష్టపోయారు. ఇప్పుడు ఏకంగా పైరుకు చీడ (నల్లి) ఆశించడంతో పైరు మొత్తం నష్టపోతోంది.

రైతన్నకు కలవరం

అష్టకష్టాలు పడి సాగులోకి తెచ్చుకున్న పత్తి పంటకు తెగులు సోకడంతో రైతన్న దిక్కులు చూస్తున్నాడు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులతో పంట పెరుగుదల లేకపోవడం, చీడ (నల్లి) బారిన పడి పంట మొత్తం నాశనమవుతుండడం రైతును మరింత కలవరానికి గురి చేస్తుంది. అదే విధంగా తెల్లదోమ, పచ్చదోమ, మిల్లీబాగ్, అగ్గి తెగులు, పచ్చ పురుగు, కాండంతొలుచు పురుగులు పత్తి పంటను నాశనం చేస్తున్నాయి. ముఖ్యంగా బీటీ పత్తి పంటను సాగు చేస్తే ఎటువంటి తెగులు సోకవని, పురుగులు ఆశించవని శాస్త్రవేత్తలు పేర్కొన్నప్పటికీ నేడు పత్తి పంట మొత్తం పురుగుల మయం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


నందవరం మండలం నాగలదిన్నెలో సాగు చేసిన పత్తిపంట

పంటకు పెట్టుబడి ఇలా..

- ఎకరా పొలం దుక్కిదున్నడానికి (ట్రాక్టర్‌తో) రూ. 1800లు, కల్టీవేటర్ (చదును) చేయడానికి రూ. 700లు ఖర్చువుతుంది.
- విత్తనం (ఎకరాకు రెండు ప్యాకెట్లు) రూ. 1860, అచ్చువేయడానికి రూ. 1000లు, విత్తనం నాటడానికి కూలీలు రూ. 400.
- కలుపు నివారణకు దంతె, గుంటక పాయడానికి అయ్యే ఖర్చు రూ. 2200, కలుపు తీత కూలీల ఖర్చు రూ. 3500.
- ఎరువులు (రెండు దశల్లో కాంప్లెక్స్) రూ. 4200లు, మూడవ దశ యూరియా - పొటాషియంకు రూ. 1600లు ఖర్చు. ఎరువులు చల్లే కూలీల ఖర్చు.
- పురుగుల నివారణ మందు ఖర్చు రూ. 3500లు ఈ లెక్కన ఎకరా ఖర్చు రూ. 21560.


పత్తిపంటకు ఎర్రతెగులు

- ఎకరాకు వచ్చే దిగుబడి మెట్టపొలమైతే 10 క్వింటాళ్లు, నీటి పారుదల వుంటే 15 క్వింటాళ్లు. క్వింటా పత్తి తీయడానికి కూలీలు, రవాణా ఖర్చు రూ. 500లు చొప్పున ఎకరాకు రూ. 5000ల నుంచి రూ. 7500ల వరకు సరాసరి పెట్టుబడి రూ. 25000ల నుంచి రూ. 30000ల వరకు. కౌలు రైతైతే ఎకరాకు రూ. 10000లు అదనం.

ఇన్ని ఖర్చులు పెట్టి సాగు చేసిన పత్తి పంటకు ఒక పక్క వర్షాభావం, మరో పక్క చీడ పీడల దాడి తీవ్రంగా నష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా రైతు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.


పత్తిపంటను నాశనం చేస్తున్న నల్లి పురుగు

రైతుకు నష్ట కాలం



రైతులకు వ్యవసాయం కలసి రావడం లేదు. పంట ఉంటే ధర పలకదు..ధర ఉంటే పంట పండదు. తుంగభద్ర దిగువ కాలువకు నీరు అంతంత మాత్రమే. అందుకే రైతులు 90శాతం పత్తి పంటనే సాగుచేశారు. ఇప్పుడేమో దానికికూడా తెగుళ్లు సోకి రైతన్నను పట్టిపీడిస్తున్నాయి. రైతులకు కాలం కలసి రావడం లేదు. – వెంకటేష్, పత్తి రైతు

వాతావరణంలో మార్పులతోనే ఇబ్బందులు



వాతావరణంలో మార్పులు వ్యవసాయానికి ఇబ్బందిగా మారాయి. ఖరీఫ్ సీజన్ అదను ముగుస్తున్నా పూర్తి విస్తీర్ణంలో పంటసాగుకాలేదు. బావులు, బోర్లలో నీరు ఇంకిపోయాయి. కాలువల పరిధిలో సాగునీరు రావటంలేదు. వివిధ రకాల తెగుళ్లు పత్తిపంటను నాశనం చేస్తున్నాయి. వ్యవసాయ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ రైతులకు సస్య రక్షణపై అవగాహన కల్పిస్తున్నాం.
– మహ్మద్ ఖాద్రి, ఏడీఏ

పరిధిని మించి వైద్యం చేస్తే చర్యలు


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: గ్రామాల్లో, మండల కేంద్రాల్లో ఆర్‌ఎంపీలు పరిధిని మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ హెచ్చరించారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆదోని మండలంలోని ఆర్‌ఎంపీలతో సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు, జలుబు వస్తే వారికి టాబ్లెట్స్ మాత్రమే ఇవ్వాలన్నారు. ఒకవేళ 24 గంటలు గడిచినా కూడా తగ్గకపోతే గ్రామాల్లో ఉన్న ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ కేంద్రాలకు పంపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫ్లూయిడ్ బాటిల్స్ ఎక్కించరాదని స్పష్టం చేశారు. గ్రామాల్లో అక్కడక్కడ గర్భిణులకు అబార్షన్ చేసి భ్రూణహత్యలు చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయన్నారు. ఇలాంటివి చేస్తే పీసీపీ యాక్ట్ ద్వారా జరిమానాతో పాటు జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, డాక్టర్ బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

పెద్దకడబూరు : ఈ నెల 16 నుంచి వచ్చేనెల 20వ తేదీ వరకు మండలంలో నిర్వహించే రెవెన్యూ సదస్సులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దారు మహేష్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులలో మ్యూటేషన్, కౌలు రైతు కార్డులు, ల్యాండ్ గ్రామింగ్, భూమి తగాదాలు, సెక్షన్ 22ఏ తారుమారులతో పాటు ఇతర సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 8న తారాపురం, 20న గవిగట్టు, 22న రంగాపురం, 23న నౌలేకల్లు, 24న చిన్నకడబూరు, 27న బాపులదొడ్డి, 29న పీకలబెట్టా, 31న హులికన్వి, వచ్చే నెల(సెప్టెంబర్) 3న బసలదొడ్డి, 4న మేకడోణ, 5న ముచ్చగిరి, 6న కంబదహాల్, 10న కంబలదిన్ని, 11న కల్లుకుంట, 12న జాలవాడి, 13న చిన్నతుంబళం, 17న హెచ్.మురవణి, కొత్తగొల్లలదొడ్డి, 18న హెచ్.మురవణి, దొడ్డిమేకల, గంగులపాడు, రాగిమాన్‌దొడ్డి, 19న హెచ్.మురవణి, హనుమాపురం, 20వ తేదీన పెద్దకడబూరులో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

నదీతీరంలో పర్యటన


పెద్దకొత్తిలిలో నది ప్రవాహన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కే. శ్రీనివాసులు

నందవరం : తుంగభద్ర డ్యాం 19వ గేట్ కొట్టుకుపోవడంతో నదికి 1.20 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో వరద ప్రవాహం పెరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం తహసీల్దార్ కే. శ్రీనివాసులు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో కలిసి నదీతీరంలో పర్యటించారు. మండలంలోని నదికైరవాడి, గంగవరం, పెద్దకొత్తిలి, నాగలదిన్నె గ్రామాలలోని నదీ తీరంలో సందర్శించి నది ప్రవాహన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..ఆయా గ్రామాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదీ ప్రవాహం ఎక్కువైతే సమాచారం ఇవ్వాలని, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం అందుబాటులో ఉంటుందని వివరించారు. పశువుల కాపర్లు, జాల్లర్లు వేటకు వెళ్లారదని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, వీఆర్వోలు రమేష్, రఘువేంద్ర పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: కోసిగి సెబ్ సర్కిల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మంగళవారం కోసిగి మండలంలో తనిఖీలు చేస్తుండగా వందగల్లు గ్రామానికి చెందిన చూడి యల్లప్ప అనే వ్యక్తి బజాజ్ డిస్కవర్ బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తుండగా కామన్‌దొడ్డి గ్రామ సమీపంలో పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 480 ఒరిజనల్ చాయిస్ డీలక్స్ 90ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పల్లెపాడు క్రాస్ రోడ్డు డి.బెళగల్ గ్రామానికి చెందిన తలారి ఉసేని బజాజ్ ప్లాటినా బైక్‌పై తరలిస్తున్న 96 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వారిద్దరు పై కేసు నమోదు చేసి, బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో సెబ్ కానిస్టేబుల్స్ నాగరాజు, మధుసూదన్ ఉన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆదోని అర్బన్: ఆదోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమరావతి నగర్‌లో పోలీసులు పేకాట స్థావరాలపై మంగళవారం దాడులు చేశారు. ఇందులో రవితో పాటు 14 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.5 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆదోని వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మట్కా బీటర్లపై కేసులు

ఆదోని అర్బన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మట్కా బీటర్లపై మంగళవారం టూటౌన్ పోలీసులు దాడులు చేశారు. ఇద్దరు బీటర్లు, మట్కా ఆడేందుకు వచ్చిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7750 నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

చెరువులను నింపాలి

ఎమ్మిగనూరుటౌన్: తుంగభద్ర డ్యామ్‌లో ఒక క్రస్ట్‌గేట్ కొట్టుకొని పోవడంతో నీరు వృథాకాకుండా ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులను నింపాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, నాయకులు భాస్కర్ యాదవ్, బీటీ చిన్నన్నలు కోరారు. మంగళవారం స్థానిక ఎల్లెల్సీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతిపత్రాన్ని ఎల్లెల్సీ డీఈఈ లక్ష్మణ్‌కుమార్‌కు అందజేశారు.

అందుబాటులో యంత్రాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు విలువ ఆధారిత ఉత్పత్తి యంత్రాలు అందుబాటులో ఉన్నాయని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. కె. రాఘవేంద్రచౌదరి మంగళవారం తెలిపారు. వీటి ద్వారా కొర్ర, సజ్జలు, అండుకొర్రలు, అరికలు, సామలు, రాగులు, జొన్నలను కిలో రూ.10 చెల్లించి పిండి చేసుకోవచ్చునని తెలిపారు.

రిక్రియేషన్ క్లబ్‌లో అక్రమాలపై విచారణ జరపాలి

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు రిక్రియేషన్ క్లబ్‌లో జరుగుతున్న పరిణామాలు, నిధుల స్వాహపై విచారణ జరపాలని క్లబ్ సభ్యులు శివకుమార్, వర్మ, హరినారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 2016 ఏప్రిల్ 5న ఎన్నికైన పాలకవర్గ సభ్యులు క్లబ్ ఆర్థిక వనరులను దోచుకున్నారని ఆరోపించారు. అదే సమయంలో 80 మంది కొత్త సభ్యులను చేర్చుకున్నట్లు రికార్డులు సృష్టించారన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ


స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ సుధాకర్‌రెడ్డి

ఆదోని అర్బన్: పట్టణంలోని మాధవరం రోడ్డులో ప్రైవేట్ పాఠశాలల బస్సులను మంగళవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సుధాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ కలిగి ఉండాలన్నారు. అన్ని పాఠశాలలకు చెందిన బస్సులను పూర్తి స్థాయిలో తనిఖీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: మండలంలోని ఆరేకల్ గ్రామానికి చెందిన ఉసేని భార్యతో గొడవపడి మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఉసేని తల్లి పాపమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భార్య మాట వినలేదని, గొడవపడి రూములోకి వెళ్లి తలుపులు వేసుకుని ఇంట్లో ఉన్న ఫినాయిల్‌ను తాగాడు. ఎంతసేపైనా బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు పగలగొట్టి చూడగా అపస్మారకస్థితిలో ఉన్న ఉసేనిని ఆస్పత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపడుతున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

కోసిగి: మండల కేంద్రానికి చెందిన వడ్డె ఎల్లప్ప రైలులో నుంచి జాడిపడి తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు రోజు వారీగా రైలులో కర్ణాటక రాష్ట్రం రాయచూర్ పట్టణానికి వెళ్లి కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. మంగళవారం ఉదయం కోసిగి నుంచి రైలులో కూలీ పనులకు వెళ్లాడు. అక్కడ పనులు దొరకక పోవడంతో మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుగుపయనమయ్యాడు. అయితే కోసిగి మండలంలోని ఐరన్‌గల్లు స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి కిందకు పడిపోయాడు. దీంతో తలకు, ముఖానికి తీవ్ర రక్త గాయాలు కావడంతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గాయాలతో ఉన్న వడ్డె ఎల్లప్పను చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బనవాసిలో రోప్ స్కిప్పింగ్ పోటీలు


పోటీల్లో తలపడుతున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం రెండవ రోజు రీజనల్ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి ఆధ్వర్యంలో జరిగాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులకు 15 రోజులు విద్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పోటీల్లో 22 నవోదయ విద్యాలయాల నుంచి 141 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొంటున్నారని చెప్పారు. పోటీల్లో భాగంగా రాత్రి విద్యార్థినీ, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఆదోని రూరల్: పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం రెండో రోజు శిక్షణ తరగతులను మండలంలోని పెద్దహరివాణం గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీ నాగరాజు, టీఓటీలు ఎ.నాగరాజు, విజయలక్ష్మి పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. శిక్షణలో వర్మీ తయారు చేయు విధానం గురించి వివరించారు.

కౌతాళం: అభివృద్ధి పనులపై ప్రతి సర్పంచ్‌కు అవగాహన అవసరమని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. సర్పంచ్‌లకు, కార్యదర్శులకు రెండవ రోజు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు.

నందవరం : 2024-25 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీ అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ముందుస్తు అభివృద్ధి ప్రాణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో దశరథ రామయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఎంఈఓ-2 రఘునాథ్ పాల్గొన్నారు.

పత్తి పంటలో తలమాడు తెగులు


పెద్దనేలటూర్‌లో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

గోనెగండ్ల : పత్తి పంటలో తలమాడు తెగులు రసం పీల్చే తామర పురుగు ద్వారా వ్యాప్తి చెందుతోందని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. మంగళవారం ఆయన ఏఓ హేమలతతో కలిసి పెద్దనేలటూర్ గ్రామంలో పత్తి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో ఈ వైరస్ పత్తిపంట చుట్టూ ఉన్న వయ్యారి భామ, గడ్డి చేమంతి, ఉత్తరేణి, కలుపు మొక్కల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు వైరస్ ఆశించిన మొక్కల ఆకుల మీద, కింద భాగములో ఆకుపచ్చ, ఊదారంగు వలయాకార చిన్న మచ్చలు ఏర్పడి అవి క్రమేణా పెద్దవిగా తయారవుతాయన్నారు. మొక్కలు గిడసబారి, మొగ్గలు, చిన్న కాయలు రాలిపోతాయని చెప్పారు. ఈ వ్యాధి నివారణకు పొలం, గట్లమీద కలుపు లేకుండా చూసుకోవాలన్నారు. చేను చుట్టూ నాలుగు వరుసల జొన్న లేదా మొక్కజొన్న కంచె పంటగా వేసుకోవాలని సూచించారు. అలాగే ఎకరానికి 40-50 నీలం, తెలుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని, వేపనూనె పదివేల పీపీఎం 2 మిల్లీలీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పిప్రోనిల్ 2మి.లీటర్లు లేదా థాయోమిథాక్సం 0.2 గ్రాములు లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి

ఆదోని టౌన్: మున్సిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లించే ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఉండాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం వాటర్ సప్లై సర్వేను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని గృహాలకు ఇంటి పన్ను కలిగి ఉండాలన్నారు. ఇంటి పన్ను కలిగి ఉన్న ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఉందా లేదా అనేది పరిశీలించడం జరిగిందన్నారు. ప్రతిఒక్కరూ ఇంటికి కుళాయి కనెక్షన్ వేయించుకోవాలన్నారు. తుంగభద్ర దిగువ కాలువ నుంచి బసాపురం, రాంజల చెరువుకు ఫిల్టర్ బెడ్లకు రా వాటర్‌ను పంపింగ్ చేసి ఫిల్టర్ చేసిన అనంతరం కాలనీలకు వదులుతామని తెలిపారు. పట్టణానికి తాగునీటి సమస్య ఏమీ లేదన్నారు.

తాగునీటికి పైప్‌లైన్


జేసీబీతో పైప్‌లైన్ పనులు చేయిస్తున్న గ్రామ సర్పంచ్ వారం ఈరన్న

కోసిగి: గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పంచాయతీ నిధులతో తాగునీటి పైప్‌లైన్ పనులు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, తుంబిగనూరు గ్రామ సర్పంచ్ వారం ఈరన్న తెలిపారు. మంగళవారం తుంబిగనూరు గ్రామంలో జేసీబీని ఏర్పాటు చేసి బీసీ కాలనీలో ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి 10 కుళాయిలు ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ హయాంలో మా గ్రామం మజరా నుంచి కొత్తగా గ్రామ పంచాయతీగా ఏర్పాటయ్యిందన్నారు. అప్పటి నుంచి గ్రామంలో సమస్యలు లేకుండా పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సాతనూరు ఎస్‌ఎస్ స్కీమ్ నుంచి గ్రామానికి పుష్కలంగా తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు కూడ గతంలో చేయించామని తెలిపారు.

వైఎంకే పాఠశాలలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని వైఎంకే పాఠశాలలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొనసాగుతుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతేడాది డిగ్రీ కళాశాలను వైఎంకే పాఠశాలలో ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు సంవత్సరంపై బడి బిల్డింగ్‌కు సంబంధించి బాడుగ ఇవ్వట్లేదని పాఠశాల యజమాని చిన్న బసప్ప ఖాళీ చేయమని కళాశాల సిబ్బందికి చెప్పారన్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సమస్యను తన దృష్టికి తేవడంతో పాఠశాల యజమానితో మాట్లాడి యథావిధిగా కొనసాగించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని, ఇందుకోసం నిరంతరం పోరాటాలు చేయక తప్పదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పద్మశాలీ కళ్యాణ మండపంలో ఎస్ఎఫ్ఐ 47వ ప్లీనరీ సమావేశాలు నిర్వహించారు. ప్రముఖ వైద్యులు మాలకొండయ్య, నాయకులు నాగమణి, టి.నరసింహ, రంగప్ప, అబ్దుల్లా మాట్లాడారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

నందవరం : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని తహసీల్దార్ కే. శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గంగవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అనంతరం రికార్డులు, చిన్నారులను పరిశీలించారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తనిఖీలో ఆర్ఐ జెర్మియా పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి


బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, నాయకులు, కార్యకర్తలు

ఆదోని అర్బన్: ప్రతి ఇంటిపై స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పిలుపునిచ్చారు. మంగళవారం 'హర్ ఘర్ తిరంగా' అనే కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు నుంచి ఆర్ట్స్ కళాశాల, ఎమ్మిగనూరు రోడ్డు, కోట్ల కూడలి మీదుగా ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వరకు ర్యాలీ కొనసాగింది. ఆస్పత్రి వద్ద నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు విట్టా రమేష్, జనసేన నాయకులు మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.